# పత్రిక

## చిరంజీవి

"టిక్కెట్ సార్, టిక్కెట్'

ఒక్కసారి ఉలిక్కిపడ్డా. ఎదురుగుండా టిక్కెట్టు కలెక్టరు. చెయ్యి జేబులోకి పోయి వెతుకుతున్నది ఏదో. చెయ్యి అడ్డు పెట్టి పక్కకు నిలబడమని సంజ్ఞ చేశాడు.

"లేదండిసార్, తొందరమీద గుంటూరులో ఎక్కాను. ఎక్సెసు చార్జి తీసుకోండి, సెకండు క్లాసులో వచ్చాను" అన్నాను.

'ఇలాంటి వాళ్లని చాలామందిని చూశాను' అన్నాడు టి. సి.

"లేదుసార్, నేను అలాంటి వాణ్ణిగాను"

"ఐతే ఈ రైలు గుంటకల్ నుంచి బయలుదేరుతుంది. అక్కడ నుంచి ఎక్సెస్సు చార్జీ ఇవ్వండి" అన్నాడు టి, సి,

ప్రయాణీకులు గేటుగుండా టిక్కెట్లు ఇచ్చి వెళ్లిపోతున్నారు. పోర్టర్లు 'మెయిల్ వచ్చింది' అంటూ కేకలు వేసుకొంటూ బెడ్డింగులు, సంచులు, ట్రంకులు పుచ్చుకొని గేటుగుండా దాటి పోతున్నారు, గుంటకల్ నుంచి ఎక్సెస్‌చార్జీ, అందులో సెకండుక్లాసు చాలా అవుతుంది, జేబులో ఉన్నది అయిదు రూపాయిలే

ఎలాగరా భగవంతుడా! ఎరక్కవచ్చాను ఇంతకీ నాకే బుద్ధితక్కువ, లేకపోతే ఊరూ పేరు తెలియని ఆమెవరో 'ఊ. పరవాలేదు, నాతో రండి' అని ఒక్కమాట అన్నంతమాత్రంలో హఠాత్తుగా స్వర్గం ఊడిపడ్డట్టే అనుకుని ఇకముందూ వెనకా చూసుకోకుండా రైలెక్కడమే! పైగా ఇదో బరువు, చేతిలో సూట్ కేసు. ఐనా ఇప్పుడేమనుకుంటే ఏంలాభం.

అని గేటు ప్రక్కనుంచుని వున్నా.

"ఇదిగోసార్ ఐదు టిక్కెట్లు ఆమె, ఆ పిల్లవాడు, ఆడపిల్లలిద్దరు, ఆ ముసలామె" అంటూ అయిదుగురు అని చూపించి తనతో కూడా గని చెప్పి వెళ్లిపోయాడు ఒక నల్లటాయన.

"గుడ్‌మార్నింగు సార్" అని సూటుబూటు వేసుకొని వెళ్లిపోయారు మరి ఒక ఆయన-

ఆ టిక్కెట్లలో నన్నుకూడా ఒకడిగా భావించి గేటు దాటించరాదూ ఆనల్లటాయన ప్రయాణీకులంతా తగ్గిపోయారు. కొద్దిమంది ప్లాట్‌ఫారముమీద ఏదో ఆలోచిస్తూ పచార్లు చేస్తున్నారు.

'రండి ఆఫీసులోకి పోదాము' అన్నాడు టి. సి. గేటు తాళము వేస్తూ.

"ఈ పెట్టె నాదికాదు వారికి ఇచ్చి వస్తాను"

"మీరు గేటు దాటితే తిరిగి కనిపిస్తారా పదండి"

"ఇదిగోనండి రెండు టిక్కెట్లు"

చెయ్యిచాచాను టి. సి. ఆమె నవ్వుతూ 'పదండి' అంటూ రెండు టిక్కెట్లు ఆయన చేతిలో పెట్టింది.

టి. సి. తెల్లబోయి స్టూలు దగ్గిరకు లాగి కూర్చున్నాడు గేటు తెరచి-

* * *

ఆమె గుంటూరు ప్లాటుఫారము మీద పరిచయమయినది మా తోడల్లుడు సుబ్రమణ్యం హిగిన్ బాదమ్స్‌లో పనిచేస్తూవుంటే మాట్లాడిపోదామని స్టేషనుకు వచ్చాను. బెజవాడ పోయేబండి వచ్చింది. "ఈ సూటుకేసు కొంచెము చూస్తూ ఉండండి ఇప్పుడే వస్తాను" అని వెళ్లింది తొందరగా ఆమె.

ఆమెకు నాకు పరిచయము అంతకు ముందు లేదు. తొందరగా ఉన్నదని 'సరే' అని తలవూపే లోపల ఆ జనములో మునిగి పోతున్నది.

రైలువచ్చి పదిహేను నిమిషాలయింది. సిగ్నలు ఇచ్చాడు- బండి బయలుదేరి పోతూ ఉన్నది. 'ఈమె యింకా రాలేదే' అని పెదిమ విరిచి చప్పరించి నిలబడివున్నా.

"ఇదిగో ఏమండీ ఇటు ఇవ్వండి' 'అంది ఆమె ప్రక్క ఉన్న సెకండుక్లాసు కంపార్టుమెంటులో నుంచి తొంగి చూస్తూ.

ఏదో ఆడపిల్ల ఒంటరిగా ప్రయాణము చేస్తూ

ఉంది అని సూటుకేసు కంపార్టుమెంటులోనికి తీసుకొని వెళ్ళా.

"మీ మేలు మరువలేను. అక్కడ ఉంచండి" అన్నది.

రైలు ప్లాటుఫారం దాటింది.

వస్తానండి

"బెజవాడ దాకా వస్తారా"

లేదు అని రైలు దిగబోతున్నా.

దిగకండీ రైలు పోతోంది అని ఆమె తనతో కూడా ప్రయాణము చేయమని సూచనగా పక్కకు జరిగి కూర్చున్నది అంతే. బెజవాడ వచ్చేవరకు పలకరించకుండా మాస పత్రికను చదువుకుంటూ కూర్చున్నది. పెట్టెలో మేమిద్దరమే. మధ్య మధ్య పలకరించేదా అనుకున్నా కాని పలకరించలా.

బెజవాడ స్టేషను వచ్చింది. ప్లాటుఫారం మీద దిగాను. వెనక్కు తిరిగి చూచాను, ఆమెలేదు. లోపలకు వొంగి చూచాను, కనుపించలేదు, సూటుకేసు అక్కడే వున్నది, పక్కవాకిలిన దిగి ఉండాలె అనుకుని సూటుకేసు తీసుకొని అటూ ఇటూ చూసుకుంటూ గేటు దాకా వచ్చాను.

'పోర్టరుకో పిలవండి'-

'ఫరవాలేదు'.

కౌదని పిలిచింది. కూలి దొరికిందని పెట్టె లాగి మెల్లెక్కి పోతున్నాడు పోర్టరు,

'ఏమండి కొంచెము లేవుదాకా రండి' గుంటూరు నుంచి ఈమె సొంత మనిషిలాగా వాడుకుంటున్నది. యింత పరిచయము ఈమె వలె ఇంతవరకు ఏ పరాయి ఆడమనిషి నన్ను చేసికోలే-

మరేమి పనిలేదు వస్తాలెండీ అన్నా నెమ్మదిగా-

"మీరు మీ ఆడవారిని పంపించినట్లుగా భావించి యీకొంచెము సాయము చేయండి"

నాకింకా పెళ్ళి కాలేదండి-

పెండ్లి అయిన తర్వాత మీరు మీ భార్యతో పయాణం తప్పకుండా చేస్తారు అన్నాదామె-

ఆమెభవిష్యత్ నిర్ణయించింది- తిరిగి చూచాను నవ్వుకుంటూ నన్ను వెంబడిస్తున్నది, ఆమె నవ్వును చూసి నాకు నవ్వు వచ్చింది, నవ్వు నాపుకుందా మని ప్రయత్నము చేస్తున్నా ఎందుకో- నా ప్రయత్నమును చూసి హేళనగా తనలో తాను నవ్వుకుంది-

కొందరు బ్రిడ్జి ఎక్కుతున్నారు- కొందరు దిగుతున్నారు- ఎదురుగా పరిగెత్తుకొనివచ్చి వక్కణమాగి పక్కకు తప్పుకొని వెళ్ళిపోయాడు ఒకాయన్ని మరొకాయన రెండుమాటలు పుచ్చుకొని అమ్మ చేతులు వదలకండి తప్పిపోతారు అని కేకలువేస్తూ మెయిలుకు వెళ్లుతున్నారు బ్రిడ్జి దిగాము-

అయ్యో ఎక్కండి బండి ఎక్కండి అన్నాడు జట్కావాడు-

"అయ్యో యీ బండిలోనే పెట్టాను సూటుకేసు కూలి ఇప్పించండి అన్నాడు పోర్టరు-

బండదు లేవుదాకా అని పావలా డబ్బులు పోర్టరు చేతిలో పెట్టిందామె-

ఇదిగోరా పావలా అమ్మగారి పావలా వారికిచ్చేయి అన్నాను-

అమ్మగారు ఇచ్చారు కదండీ అంటూ విని పించుకోకుండా వెళ్ళిపోయాడు పోర్టరు-

బండిలో కూర్చున్నాం- జట్కా గాలికి దూసుకు పోతోంది- ఆమె ముంగురులు గాలికి చెదరి పాపిటిని కంగారు పెట్టి కళ్లతో దాగుడు మూత లాడుతున్నాయి!

"మీరు బండి ప్లాటుఫారం మీదకు రాగానే ఇట్టే మాయమయి పోయారే"

"మీరు అనకండి, మీ కంటే చిన్నదానను. నువ్వు అనండి లేకపోతే పేరుపెట్టి పిలవండి."

"మీ పేరు..."

"అదిగో మీరు అనే పదం వాడకండి, పిల్లలు లేరు. పెళ్ళికాలేదు. నా పేరు సీత" అని విసురుగా అన్నది చివరి మూడు ముక్కలు.

"సీత, చాలాబావుంది, సీతమ్మ, రావమ్మ అని పూర్వీకులు పేరు

నవనాగరికతకు నాజూకుగా ఉంది."

"మీరు నా పేరును విమర్శించకెండి. ఏలా ఉన్నా అది నా పెద్దలు పెట్టినపేరు."

"ప్లాటుఫారంమీద కనపడ్డేదే నువ్వా."

తిరిగి మొదటిప్రశ్నే అడిగాను. ఈ సారి 'నువ్వ' అని అన్నా. నాకు తృప్తికరముగా కనిపించలా. కొత్త పరిచయము కలిగింది కదా అని పరాయిపిల్లను నువ్వ అని అంటే ఏమంత బావుంటుంది- ఎవరన్నా వింటేః అది ఆమె కిష్టమేమో. కాకపోతే ఎందుకు చెప్పుతుంది అలా అనమని.

బండి బజారులుదాటి బక్కింగుహాము పోస్టాఫీసుదాటి బందరు కాలవకు వెడుతోంది.

"మా బాబాయిగారు కనుపించారు. పక్కవాకిలిన దిగి వారితోకూడా మెయిలుదాకా వెళ్ళివచ్చాను."

నాతో చెప్పలేదేం.

"అయ్యా ఇదే రేవు" అన్నాడు బండివాడు మా ఇద్దరి సంభాషణకు అడ్డు వచ్చి. బండి ఆగింది- ఇద్దరము దిగాము. బండివాడు పెట్టె అందించాడు.

అయ్యా బాడుగ యివ్వండి రూపాయి.

ముందుగా జేబులో చెయ్యిపెట్టి తీసియిచ్చాను నేను.

నేను యిస్తావుండండి అన్నదామె.

ఇది వినిపించుకోకుండానె వెళ్ళిపోయాడు బండివాడు.

## ౨

లాంచిరేవులో ఉంది. పి. డబ్లియు గుమాస్తా వచ్చి నీటిమట్టము చూసి, నోటుచేసికొని, లాకు మేస్త్రీతో ఏదో గుసగుసలాడిపోయాడు క్రిష్ణవేణివారిని చూసి భయపడి మెలికలు తిరుగుతూ, లాకుల సందులనుంచి, అలసి, సొలసి, నురుగులు కక్కుతూ, దూరాన్న ఉన్న సముద్రుడ్ని కలసి కావలించుకుపోతోంది.

ఇదిగో అబ్బాయి! లాంచి ఎన్నింటికి బయలు దేరుతుంది.

పదిగంటలకు ఎక్కండి అన్నాడు లాంచిసరంగు.

ఆమె లోపలకు వెళ్ళి కూర్చున్నది. పెట్టె సరంగుకు అందించా. ఒకాయన చేతిగడియారము చూసి 'యీయన రాలేదే పది అయింది' అనుకుంటూ లాంచి ఎక్కి తుదిసారి తొంగిచూసి లోపల కూర్చున్నాడు. సరంగు బూర ఊదాడు. ప్రయాణీకులు ప్యాసింజరు షెడ్డులోనుంచి, హోటళ్ళలోనుంచి, కిళ్లీదుకాణాలనుంచి ఒక్కసారి వచ్చారు.

లాంచి నిండింది. కండక్టరుకు రెండురూపాయలు యిచ్చి ఆ ముందగ కూర్చున్న ఆమె వెళ్లే వూరుకు టిక్కెట్టు యివ్వమన్నా. డ్రైవరు ఇంజను వదలాడు.

వస్తానండి అన్నదామె నీళ్ళవంక చూస్తూ.

మంచిది అన్నా వొడ్డున నిలబడి.

నీటిపారున పడిపోయింది లాంచి. తిరిగివచ్చి గుంటూరు రైలుఎక్కా..

## ౩

రెండేళ్ళయింది. యీ లోపల మా కిద్దరకూ పెళ్ళి కావటమూ సీత కాపరానికి రావటమూ జరిగింది, మా మామగారు వచ్చే సంక్రాంతి పండుగకు వుభయులు రావలసిందని ఉత్తరం వ్రాస్తూ కూతుర్ని కొంచెం ముందర పంపమని అన్నాడు.

ఆ రోజు ఆదివారం. ఆఫీసుకు శలవు. నక్షత్రబలం తారాబలం చాలా బావుంది. వారశూల లేదు. సీతని తీసుకొని వెళ్లి లాంచి ఎక్కించా.

వెళ్ళి చేరంగానే ఉత్తరం వ్రాయించు.

ఉత్తరం వ్రాయిస్తానుగాని మీరు పండుగకు తప్పకుండా రావాలె.

'వస్తానండీ' అనలేదే ఆ రోజులాగా.

మీకు జ్ఞాపకముంది.

ఎందుకు లేదూ.

నవ్వింది, నవ్వాను, లాంచి కదలింది, దిగువకు పడిపోతోంది

ఉత్తరం వ్రాయి,

'ఊ' అన్నది.

ఇద్దరు వచ్చి 'పడవ వెళ్ళిందా' అని చూసి వక పది నిముషములు ముందుగా బయలుదేర వలసిందని తిరిగి వెళ్ళిపోయారు.